
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3, కనిష్ఠం 26.5

నిజామాబాద్

జిల్లా వార్తలు

1

ఆదివారం 15 జూన్ 2025



మాట్లాడుతున్న రాజీవ్‌గాంధీ హన్మంతు

- ఉమ్మడి జిల్లాలోని మంజీరా నదిలో జోరుగా ఇసుక తవ్వకాలు
- అనుమతుల మాటున యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు
- టిప్పర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మకాలు
- అధికార పార్టీ అండదండలతో కొనసాగుతున్న ఇసుక దందా
- వాగులనూ కూడా వదలకుండా జోరుగా తవ్వకాలు



- మంజీరా వెంట పోతంగల్, హంగర్గ, కారేగాం, సుంకిని వద్ద ఇసుక తవ్వకాలు

అభివృద్ధి పనుల పేరిట

జోరుగా ఇసుక తవ్వకాలు!

నిజామాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. అభివృద్ధి పనులు, అనుమతుల పేరిట అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మంజీరా, ఇతర వాగుల్లో భారీ ఎత్తున ఈ తవ్వకాలను సాగుతున్నాయి. వర్షాలు పడకపోవడంతో వాగుల్లోని ఇసుకను వీలైనంత తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో మైనింగ్, రెవెన్యూతోపాటు ఇతర శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్లు, ఇతర అభివృద్ధి పథకాల పేరిట అనుమతులు ఇస్తున్నా కొంతమంది సిండికేట్‌గా మారి ఈ తవ్వకాలను చేస్తున్నారు. యంత్రాలతో రాత్రింబవళ్లు తవ్వకాలు చేస్తూ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల అధికారులు ఇసుక వాహనాలను సీజ్ చేస్తున్నా అధికార పార్టీ మండల స్థాయి నేతలు జోక్యం వాటిని వదిలేస్తున్నారు. ఎక్కడికక్కడ కొంతమంది నేతలు ఇసుకపైనే దృష్టిపెట్టి తవ్వకాలను చేస్తుండటంతో మంజీరా వెంట ఎక్కువ మొత్తంలో ఇసుక తరలిపోతోంది.

పెరిగిన నిర్మాణాలతో ఇసుకకు డిమాండ్

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇసుకకు డిమాండ్ పెరిగింది. భవన నిర్మాణాలు పెరగడం, అభివృద్ధి పనులు జరుగుతుండటం, కొత్తగా జాతీయ రహదారులతోపాటు జిల్లా రహదారుల నిర్మాణం జరుగుతుండటంతో ఎక్కువ మొత్తంలో ఇసుక అవసరమవుతోంది. జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకురావడంలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో ఎక్కువ మొత్తంలో మంజీరాపై కన్నేసి మంజీరా నది వెంట భారీగా తవ్వకాలను చేస్తున్నారు. బిచ్కుంద, బీర్కూర్, పోతంగల్, సాలూరా, రేంజల్ మండలాల పరిధిలో ఈ తవ్వకాలను చేస్తున్నారు. మంజీరా వెంట ఇసుక నిల్వలు అధికంగా ఉండటం ప్రతీయేటా వరదలు రావడంతో ఇసుక నిల్వలు పేరుకున్నాయి. దీంతో గతంలో ఈ నది వెంట బిచ్కుంద, బీర్కూర్ మండలాల పరిధిలో గతంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు క్వారీలను కేటాయించారు. ఈ క్వారీలలో భారీగా తవ్వకాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ క్వారీలను నిలిపివేసి పోతంగల్, సాలూరా మండలాల పరిధిలో ఈ మధ్యే క్వారీలకు అనుమతులను ఇచ్చారు. అయితే ఇంకా ఇసుక తవ్వకాలను మొదలు పెట్టలేదు. గతంలో మంజీరా నది పరివాహక ప్రాంతంలో వరదలతో ఇసుక మేటలు వేసిన రైతుల భూముల్లో కూడా తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఈ అనుమతుల మాటున నదిలో ఎక్కువగా తవ్వకాలు చేస్తున్నారని పలు ఫిర్యాదులు అందడంతో వాటిని రద్దు చేశారు. గడిచిన సంవత్సరం కాలంగా అభివృద్ధి పనులకు తప్ప క్వారీలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ అనుమతుల మాటునే ఈ నది వెంట ఎక్కువగా తవ్వకాలను చేస్తున్నారు.

కూలీలను కాదని.. యంత్రాలతో తవ్వకాలు

అధికారులు ఇచ్చే వేబిల్లు ఆధారంగా ఎక్కువ మొత్తంలో ఇసుకను తవ్వకాలు చేపడుతున్నారు. అభివృద్ధి పనులకు ఇసుక తవ్వకాలను కూలీల ద్వారా చేపట్టాల్సి ఉండగా.. కూలీలు దొరకడం లేదని ప్రొక్లెయిన్, ఇతర యంత్రాల ద్వారా తవ్వకాలను చేస్తూ లారీలను నింపుతున్నారు. వాటి ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. టన్నుకు రూ.1800 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తూ ఇసుకను అడిగిన వారికి చేరవేస్తున్నారు. వాహనం ద్వారా 20టన్నుల ఇసుకను తరలించి రూ.40వేల వరకు విక్రయిస్తున్నారు. బిచ్కుంద, బీర్కూర్, పోతంగల్, సాలూరా మండలాల పరిధిలో కొంత మంది నేతలు సహకరిస్తుండటంతో ఈ రవాణా అవుతోంది. మంజీరా వెంట ప్రతీయేటా ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి.

ఎక్కడికక్కడ డంపులు

ఇసుక డిమాండ్ తగ్గిన సమయంలో ఆయా గ్రామాల పరిధిలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలించి డంప్‌లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. ఈ మండలాల పరిధిలోని అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు ఈ దందాను కొనసాగిస్తుండగా వీరికి అధికారగనం కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పైనుంచి నేతల ద్వారా ఒత్తిళ్లతో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. ఎక్కడైనా అధికారులు వాహనాలు సీజ్ చేస్తే వెంటనే ఈ నేతలు విడిచిపెట్టేలా ఒత్తిళ్లు పెంచుతున్నారు. ఈ మంజీరా వెంట అధికార పార్టీలోనే వర్గాలుగా ఉన్న నేతలు సహకరించడంతో ఎవరికి వారే ఒత్తిళ్లు పెంచుతూ తవ్వకాలు చేస్తున్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌తోపాటు ఇతర సంస్థలు మంజీరా వెంట ఇసుక తవ్వకాలు నిబంధనలకు మించి జరుగుతున్నాయని, వాటిని ఆపాలని గతంలోనే ఆదేశాలను ఇచ్చారు. జాతీయ హైడ్రాలోజీ సంస్థకు చెందిన సైంటిస్టులు కూడా మంజీరా వెంట సర్వే నిర్వహించారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు ఎంతమేరకు తగ్గుతున్నాయో అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా నివేదికను అందించారు. కానీ నేటికీ చర్యలు మాత్రం తీసుకోలేదు. ఈ మంజీరా నది అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోకి ఈ ఇసుక (మిగతా 4వ పేజీలో..)

జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది

- అందరి సహకారంతో జిల్లాను ముందుంచాం
- వీడ్కోల సమావేశంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్, జూన్14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు రెండున్నరేళ్లపాటు విధులు నిర్వర్తించడం ఎంతో గొప్ప అనుభూతి ఇచ్చిందని, జిల్లాతో ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ మర్చిపోలేనిదని బదిలీ అయిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. ఆయన బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.వినయ్ కృష్ణారెడ్డికి ఇదే వేదికపై స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నిశాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు బదిలీ అయిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పనితీరును ఆయనతో కలిసి పని చేసిన అనుబంధాన్ని గుర్తుచేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీగా బదిలీపై వెళ్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ కలెక్టర్‌గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కిందిస్థాయి ఉద్యోగి మొదలు కొని ప్రతీ శాఖకు చెందిన అధికారులందరూ అన్ని విషయాల్లో ఎంతగానో సహకరించారని అన్నారు. వారి తోడ్పాటు కారణంగానే జిల్లాలో ధాన్యం సేకరణ వంటి అనేక అంశాలలో ముందంజలో నిలపగలిగామని, వరుసగా వచ్చిన శాసనసభ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలను ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించడంలో సఫలీకృతం అయ్యామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన జిల్లాలో పనిచేయడంతో ధాన్యం సేకరణ, పసుపు, ఎర్రజొన్న వంటి అంశాలతోపాటు సాగురంగంపై మంచి అనుభవం ఏర్పడిందన్నారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.వినయ్‌కృష్ణారెడ్డితో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని జిల్లాకు సమర్థవంతమైన అధికారి కలెక్టర్‌గా వచ్చారని ఆయన నేతృత్వంలో జిల్లా మరింత ప్రగతి దిశగా పయనిస్తుందని నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తిస్తూ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని తనకు సహకరించిన విధంగానే నూతన కలెక్టర్‌కు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతు కలెక్టర్‌గా తనదైన ప్రత్యేకతను చాటారని ఆయన (మిగతా 4వ పేజీలో..)

నిరుపయోగంగా స్లాటర్ హౌస్

- ఏళ్లతరబడి వృథాగా మారిన స్లాటర్‌హౌస్, మాంసం దుకాణాల గదులు

3



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

నూతన కలెక్టర్‌ను కలిసిన సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి.వినయ్‌కృష్ణారెడ్డిని శనివారం సీపీ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయనను కలిసి పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. జిల్లాలోని పరిస్థితులు, శాంతి భద్రతల గురించి ఇరువురు చర్చించినట్లు తెలుస్తోంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా చర్యలు ఉంటాయని సీపీ సాయిచైతన్య హెచ్చరించారు. నిఘా వ్యవస్థ ఉంటుందని ప్రతి ఒక్కరు తమ నడవడికను మార్చుకోవాలని, లేదంటే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఎవరికైనా వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడం లేదా సమాజంలో ఉద్రిక్తతలను రేపేలా వ్యవహరించిన వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. ఈనెల 11న మోర్తాడ్ గ్రామంలో రొయ్యల సురేష్ అనే వ్యక్తి మసీదు ఏరియా నుంచి తన కారులో వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డుపై బైక్ నిలిపి ఉన్న మహమ్మద్ షహబాస్, అబ్దుల్ మజాక్‌లను బైక్ తీయమని అడగగా వారు సురేష్‌పై బూతులు తిట్టి బైక్ ఎత్తివేసి రాడ్‌తో తలపై కొట్టారని అన్నారు. అక్కడ ఉన్న కొంత మంది వారిద్దరికి సపోర్ట్‌గా నిలిచి సురేష్‌పై దాడి చేశారని సురేష్ భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి షహబాజ్, అబ్దుల్ మజాక్, మద్దతుగా నిలిచిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారం తెలిస్తే దగ్గరలోని పోలీస్‌స్టేషన్, లేదా డయల్ 100, స్పెషల్ బ్రాంచ్‌నెంబర్ 8712659777, పోలీస్‌కంట్రోల్‌రూమ్ నెంబర్ 08462-226090 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జిల్లా లోక్ అదాలత్‌లో 26,052 కేసులు రాజీ

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భరతలక్ష్మి



90లక్షల అవార్డు కాపీని కక్షిదారులకు అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ లీగల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 26,052 కేసులు రాజీ అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి భరతలక్ష్మి అన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయసేవా సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లాప్రధాన న్యాయాధికారి జి.వి.ఎన్. భరతలక్ష్మి, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్‌పర్సన్ భరతలక్ష్మి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న పలు కేసులు రాజీకి కుదుర్చుకున్నట్లయితే సమయంతోపాటు సమానన్యాయం కూడా జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 26,052 కేసులు రాజీకి కుదర్చామని బీమా, సివిల్ కేసులలో కక్షిదారులకు దాదాపు 16కోట్లకు పైగా నగదును కక్షిదారులకు అందజేసినట్లు చెప్పారు. ఇందులో బీమా కేసులో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జెన్‌కో ఉద్యోగి ప్రేమ్ దాస్ బాధిత కుటుంబం తరఫున న్యాయ వాది రమేష్, చోల మండలం ఇన్సూరెన్స్ తరపున న్యాయవాది సదానంద్‌గౌడ్ ఇరు వర్గాల రాజీతో 90లక్షలకు కేసును రాజీ కుదిర్చి అవార్డును అందజేశారు. నేడు మొత్తం సివిల్ కేసులు కలుపుకొని దాదాపు 3కోట్ల రపాయలకు పైగా నగదును కక్షిదారులకు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్‌రావు, సీనియర్ న్యాయవాదులు సురేష్ బాబు, సంస్థ ప్యానల్ సిబ్బంది, సంస్థ సూపరింటెండెంట్ శైలజా, సిబ్బంది నాగరాజు, శ్రావణ్, బ్యాంకు మేనేజర్లు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయాలి

- నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్



ఎంపీ అర్వింద్‌తో సమావేశమైన బీజేపీ ముఖ్య నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి 30లోపు అమిత్‌షా జిల్లా పర్యటన ఉంటుందని బీజేపీ నాయకులు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు అభ్యర్థుల్లేరు

వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ చేయడానికి నాయకులు లేరని ఎంపీ ధర్మపురి అర్వింద్ (మిగతా 4వ పేజీలో..)





ఎన్నికల కోసమే ఇన్‌చార్జి మంత్రి మార్పు!

- జిల్లా కాంగ్రెస్ నేతల్లో కొనసాగుతున్న చర్చ
- ఉమ్మడి జిల్లాలో పార్టీలో పలు గ్రూపులు
- వాటిని సమన్వయం చేయడం ఇన్‌చార్జి మంత్రికి కత్తిమీద సామే

నిజామాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిమంత్రి మార్పుతో పార్టీల చర్చలు సాగుతోంది. ఇన్‌చార్జి మంత్రి తామే తప్పుకున్నారా లేదా అధిష్ఠానం తప్పించారా అనే చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రూపులు ఎక్కువగా ఉండటం, రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జికి పరిస్థితులపై ఫిర్యాదులు పెరగడంతో తప్పించారనే చర్చ పార్టీలోనూ, నేతల మధ్య కొనసాగుతోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీటుగా ఎదుర్కొనేందుకు నియామకం చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి పోటీ తప్పనిసరి పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లాలో బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ ఉండగా బీఆర్‌ఎస్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్‌కు మంత్రి లేకపోవడం, గ్రూపులు ఎక్కువగా ఉండటం వల్ల కొత్త ఇన్‌చార్జి మంత్రికి సమన్వయం చేయడం కూడా కష్టమే కానుంది. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల గ్రూపులతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిల గ్రూపులు కొనసాగుతున్నాయి. మంత్రి వర్గంలో స్థానం లేకపోవడం పీసీసీ అధ్యక్షుడు ఉమ్మడి జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో కొత్త ఇన్‌చార్జి మంత్రికి క్యాడర్‌ను సమన్వయం చేయడం కత్తిమీద సాములాగానే మారనుంది.

పార్టీని బలోపేతం కోసమే..

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని నియమించింది. ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పథకాల అమలుతో పాటు పార్టీ బలోపేతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్‌చార్జి మంత్రిని మార్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు కీలకం కావడం గ్రామ పంచాయతీ నుంచి జెడ్పీ వరకు పోటీ ఎక్కువగా ఉండనుండటంతో ఈ మార్పు చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కనే జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం కలిసి వస్తోందని భావించి నియామకం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో నిజామాబాద్ నుంచి బీజేపీ గెలిచింది. జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ గెలిచిన బీజేపీకి మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో ఎంపీ ఉన్నారు. కాంగ్రెస్ గత ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లా పరిధిలో ఎంపిక కాగా బీఆర్‌ఎస్ నుంచి ఎంపికైన బాన్సువాడ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి మారారు. మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్‌ఎస్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కాంగ్రెస్‌కు ధీటుగానే బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ ఉంది. క్యాడర్‌తో పాటు నేతలు కూడా ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు పార్టీకి సునయాసంగా లేదు. పంచాయతీ నుంచి జెడ్పీ, మున్సిపాలిటీ వరకు గట్టి పోటీ బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి ఎదురుకానుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎవరికి వారే గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్యేలు గ్రూపులు వేరే ఉండగా ఎమ్మెల్యేలు లేని చోట నియోజకవర్గం ఇన్‌చార్జిల గ్రూపులు ఉన్నాయి. ఇవేకాకుండా రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌లు, ప్రభుత్వ సలహాదారుల గ్రూపులు వేరే కొనసాగుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు కూడా ఉన్నాయి. ఈ గ్రూపులన్నీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో జరిగిన సమావేశాల్లో బయట పడ్డాయి. ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకులు కూడా ఇదే విషయంపై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి నివేదికలు ఇచ్చారు. కీలకమైన సూచనలు కూడా చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో క్యాడర్‌కు, నేతలకు మధ్య పెరుగుతున్న దూరం, అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత లేకపోవడం వంటి అంశాలను వివరించారు. ఇవన్నీ పరిశీలించిన మీదట ఉమ్మడి జిల్లా మంత్రిని మార్చినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన జూపల్లి కృష్ణారావు అసమ్మతులకు తావివ్వకుండా అందరిని కలుపుకొని పోయేందుకు ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఎక్కువసార్లు రాకపోవడం వచ్చిన అధికారులతో సమీక్షకు పరిమితం కావడంతో క్యాడర్‌లో నిరాశ పెరిగింది. ఈ విషయాలు కూడా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దృష్టికి వెళ్లడంతో ఈ మార్పు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కొత్త ఇంచార్జి మంత్రి సీతక్కకు కూడా ఉమ్మడి జిల్లా పరిధిలో సమన్వయం చేయడం కత్తిమీద సామే. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాధాన్యత లేదు. సీనియర్ నేతలకు పీసీసీలో అవకాశాలు రాలేదు. ఉమ్మడి జిల్లా నుంచే (మిగతా 4వ పేజీలో..)

భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. శనివారం ఆయన నిజామాబాద్ ఆర్‌డీవో కార్యాలయాన్ని, సౌత్, నార్త్ తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధింత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ నిర్ణీత గడువులోపు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. భూభారతి చట్టంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకుంటే దరఖాస్తులను సకాలంలో సులభంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా భూభారతి చట్టంలోని నిబంధనలను పాటిస్తూ పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలి స్తూ అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులవివరాలతో సరిపోల్చుకొని క్షేత్రస్థాయి విచారణ పకడ్బందీగా చేయాలన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టంలో అప్పీల్, రివిజన్ వ్యవస్థ ఉన్నందున పౌరపాట్లకు ఆ స్కారం లేకుండా దరఖాస్తుల పరిష్కారంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కలెక్టర్‌వెంట నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ ఉన్నారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిక



ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు

నవీపేట,జూన్14(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ సమక్షంలో శనివారం పలువురు యువకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని కోస్లీకి చెందిన సందీప్, నవీపేటకు చెందిన ప్రవీణ్ రాజ్‌లతో పాటు పెద్ద ఎత్తున యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, మండల అధ్యక్షులు సరిన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తు్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారతీయ జనతాపార్టీ పట్టణ శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, లోక భూపతిరెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నూతన కార్యవర్గం నియామకం కాగా వారికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ప్రధాన కార్యదర్శులుగా గుగులోత్ తిరుపతినాయక్, ఖాందేష్ ప్రశాంత్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా బాండ్లపల్లి నర్సారెడ్డి, భోజారెడ్డి, పాన్‌శీను, దొండి ప్రకాష్‌లను నియమించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధులు జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, కొత్తురు గంగాధర్, గంగోని సంతోష్, పట్టణ ఇన్‌చార్జి సందీప్ పాల్గొన్నారు.

బోధన్‌లో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బోధన్‌రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ సమీపంలోని షెడ్డులో ఇలియాజ్ ఖాన్(27) అనే యువకుడు షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి శ్రీదేవి

ఆర్మూర్‌టౌన్,జూన్14(ఆంధ్రజ్యోతి): సంవత్సరానికి నాలుగు సార్లు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మం డల న్యాయసేవ అధికార సంఘం చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అ దాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షణిక ఆవేశంలో ఎన్నో తప్పులు జరుగుతాయని సమయం, డబ్బు వృథాకాకుండా లోక్ అదాలత్ ద్వారా సివిల్ క్రిమినల్ కేసులతో పాటు కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా సబ్‌కోర్టు 6543 కేసులు, పీడీఎం కోర్టు 83 కేసులు, ఏడీఎం కోర్టు 91 కేసులు, సెకండ్ తరగతి కోర్టు 1995 కేసులను పరిష్కరించాలి. ఈ కార్యక్రమంలో అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి నెల్లి సరళరాణి, సెకండ్‌క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, న్యాయవాదులు జగన్, రమేష్, కిష్టయ్య, గంగారాం, జీజీరాం, పోశన్న, రాజేశ్వర్, రాములు, అజిత్, రాకేష్, శ్రావణ్, కోర్టు సిబ్బంది, బ్యాంక్ అధికారులు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



బోధన్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ దృశ్యం

● రాజీ మార్గమే రాజ మార్గం ● బోధన్‌లో 1794 కేసుల పరిష్కారం

బోధన్‌రూరల్: రాజీ మార్గమే రాజ మార్గమని 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం బోధన్ కోర్టు ప్రాంగణంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ కోర్టులోని వివిధ విభాగాలలో శనివారం 1794 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు న్యాయమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖజానాలో 60లక్షల 5 వేల 443రూపాయలు ప్రభుత్వ ఖాజానాలో కోర్టు ద్వారా జమ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి శిక్షలు అనుభవిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ప్రతి ఒక్కరు రాజీ మార్గని ఎంచుకుని రాజ మార్గంలో ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో కమ్యూనిటీ కాంటాక్ట్

● 70వాహనాలు సీజ్ : ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలో సీపీ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ ఆధ్వర్యంలో కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 70ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఎలాంటి పత్రాలు లేని 70ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. అనంతరం గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారి ఆధార్ కార్డులను పరిశీలించామన్నారు. అక్రమ కార్యకలాపాలకు, మత్తు పదార్థాల నివారణకు కళ్లెం వేసేందుకే కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూరు సీఐ కృష్ణ, రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డిలతో పాటు పలువురు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసులు

పలు కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్ కుమార్

ఏర్గట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునిల్ కుమార్ పరామర్శించారు. అందులో భాగంగా నాగేంద్రనగ్‌లో గాండ్ల రమేష్ ఇటీవలె మృతి చెందిగా వారికి 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన మేర లింబాద్రిని, గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన సోమ గంగారెడ్డి గుండె పోటుతో మృతి చెందిగా వారికి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, మాజీ ఎంపిటీసి గడ్డం లింగారెడ్డి, సామ్‌సన్, దేశబోయిన సంజీవ్, బెజ్జారాం భాను, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం వినాయక్‌నగర్‌లో శనివారం పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన జక్కుల రాజ్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

మెండోర:మండలంలో బుస్సాపూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. కోమన్‌పల్లి రమేష్ కుమారుడు యువన్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య సమచారాన్ని తెలుసుకున్నారు. సోమ రాజన్న అమ్మ నర్సవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. సునీల్‌కుమార్ వెంట కాంగ్రెస్ నాయకులు నోముల శ్రీనివాస్, సాయిరెడ్డి, బొజేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ విద్యార్థినికి నీట్‌లో ఉత్తమ ర్యాంక్



ఉత్తమ ర్యాంక్ సాధించిన కృపనక్షత్ర

ఆర్మూర్ టౌన్, జూన్14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విద్యార్థిని పవర్ కృప నక్షత్రకు నీట్‌పరీక్షలో ఉత్తమ ర్యాంక్ లభించింది. శనివారం నీట్‌పరీక్ష ఫలితాలు విడుదల కాగా అంబిక ప్రవీణ్‌పవర్ కూతురు కృపనక్షత్రకు దేశవ్యాప్తంగా 3050 ర్యాంక్ సాధించగా ఓబీసీ కేటగిరిలో 1107 ర్యాంక్‌ను సాధించింది. దీంతో పలువురు విద్యార్థినిని అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కోటగిరి,జూన్14(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి, పొతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామాలలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలు గ్రామాలలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రుద్రూరులో ఉచిత యోగ, ధ్యాన శిబిరం

రుద్రూరు,జూన్14(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ యోగా దినోత్సవం 21జూన్ సందర్భంగా ఆదివారం రోజున రుద్రూరు మండల కేంద్రంలోని యోగ భవనంలో ఉచిత యోగ, ధ్యాన శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పతంజలి యోగ సోషల్ మీడియా అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ మహజన్, యోగ సమితి అధ్యక్షులు కేవీ మోహన్, బాలరాజు, పురుషోత్తం, పుట్టి ప్రకాష్,జ్యోతిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 15నుంచి 21వరకు ఏడురోజులు ఉచితయోగ, ధ్యాన శిబిరాన్ని ప్రతి రోజు ఉదయం 5:15 నుంచి 6:30 వరకు నిర్వహిస్తారన్నారు. ఈ ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో యోగ, ధ్యానం దైనందిన జీవితంలో ఎదురయ్యే రోగాలను ఏ విధంగా తొలగించుకోవచ్చునో యోగద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సంగెం గ్రామంలో కేజీ వీల్ ట్రాక్టర్ ఢీకొని నాయకం ఎర్ర సాయిలు(48)అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ వీల్స్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపుతూ సూర శ్రీనివాస్ అనే వ్యక్తి ఎర్ర సాయిలుకు టక్కర్ ఇవ్వగా అతని కాళ్ల, తలపై నుండి ట్రాక్టర్ దమ్ము చక్రాలు ఎక్కిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



అల్లూరి లింగారెడ్డి మృతదేహం

నందిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గోదావరి నది బ్రిడ్జిపై నుంచి బాద్గుణ గ్రామానికి చెందిన అల్లూరి లింగారెడ్డి (55) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. శనివారం ఉదయం శవం లేలడంతో గజ ఈతగాళ్లతో లింగారెడ్డి శవాన్ని బయటకు తీయించారు. మృతునికి కొడుకు, కూతురు ఉన్నారని, ఇటీవల కొడుకు భార్య (కోడలు) అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లింగారెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పశువు మృతి

వేల్పూర్, జూన్14 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో దోబిఘాట్ సమీపంలోని మర్రి చెట్టుకు ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరుకు తగిలి ఒక పశువు మృతిచెందింది. స్థానిక గ్రామానికి చెందిన సాకలిబండి రాము కు చెందిన ఏడుసంవత్సరాల పశువు విద్యుత్ షాక్‌తో మరణించింది. ఈ విషయాన్ని రాము వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డుప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

నాగిరెడ్డిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం, లారీ కంటైనర్ ఢీకొనగా దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శెట్పల్లి సంగా రెడ్డి గ్రామానికి చెందిన ఒడ్డే చిన్న గాలయ్య, తన భార్య సిద్ధవ్వతో కలిసి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై మం డల కేంద్రంలో వెళుతుండగా మెదక్ వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు వెళుతున్న మహారాష్ట్రకు చెందిన కంటైనర్ లారీ మం డల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం, కంటైనర్ ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నాయకులు

నవీపేట,జూన్14(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినయ్ కృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మానికేశ్వర్ రావు, మనోహర్ రావులు ఉన్నారు.

ముత్యాల సునీల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మోర్తాడ్‌లో అర్గుల రమేష్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను శనివారం మండలంలోని తాళ్ళరాంపూర్, నాగేంద్రనగర్ కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. తాళ్ళరాంపూర్‌లో ఎస్సీ బీసి కమ్యునిటీ హాల్‌నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా 10లక్షలు, నాగేంద్రనగర్‌లో నాగేంద్రుని ఆలయ ప్రహరీ, సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా 15 లక్షలు మంజూరు ఇప్పించినందుకు గాను కృతజ్ఞతగా సునీల్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, సామ్‌సన్, దేశబోయిన సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం : ఎస్సై

భీమ్‌గల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని ఎస్సై మహేష్ తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మనిషి మానసిక స్థితి దెబ్బతిని మతిస్థిమితం కోల్పోవడం, చదువుపై ఆసక్తి తగ్గిపోవడం, కుటుంబసంబంధాలు చెడిపోతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అజయ్ పవర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



పోలీసులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వాటి అమలుకు కృషి చేయాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. శనివారం బోధన్ పట్టణ పోలీస్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన వీధుల గుండా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వాటి అమలుకు కృషి చేయాలని సీఐ ప్రజలకు తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పోలీస్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు నియమ, నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

భీమ్‌గల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు మండల కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. అట్టి చెక్కులను శనివారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెజె నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు పర్స అనంత్‌రావు, వీడీసీ చైర్మన్ నీలం రవి, నాయకులు దావుద్, షాదుల్లా, అంజుం, సతీష్, మహేష్, శ్రీను, కిరణ్, రెహమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణ్ గ్రామానికి చెందిన గుజ్జరి జగదీష్గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయ పడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం మృతుడి భార్య సునీత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవులు నరేష్‌గౌడ్ రూ.60 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్ రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని జిరాయత్ నగర్ విద్య హైస్కూల్ ఆవరణలో అవ్వకు బువ్వ కార్యక్రమంలో భాగంగా 47 మంది పేద వృద్ధులకు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విద్య ప్రవీన్ పవార్, ఉపాధ్యక్షులు విద్యగోపికృష్ణ పట్వారి, ఎస్‌జీ శ్రీకాంత్, కోశాధికారి గోలి శ్రీధర్, డాక్టర్ గంగాధర్, ఖాందేష్ సత్యం, పట్వారి తులసి, మీర శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

మోర్తాడ్, జూన్14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియమితులైన స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కను శనివారం పీసీసీ అధికార ప్రతినిధి, కామారెడ్డి జిల్లా పీసీసీ పరిశీలకులు బాస వేణుగోపాల్‌యాదవ్ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీతక్క ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా అభివృద్ధి దశలో ప్రయాణిస్తుందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు.

రామన్నపేట్‌లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ

వేల్పూర్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామంలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో కుట్టిన స్కూల్ యూనిఫామ్‌లను విద్యార్థులకు శనివారం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్‌లను విద్యార్థులకు ఐకేపీకి చెందిన డ్వాక్ర మహిళలు స్వయంగా కుట్టిన డ్రెస్సులను విద్యార్థులకు అందజేశామని ఏపీఎం మాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో సీసీ ప్రకాష్, మహిళ సమైక్య సీఏలు, మండల మహిళ అధ్యక్షులు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

రామారెడ్డి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ సమితి ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దోమల శ్రీధర్, శిక్షణ సమితి అధ్యక్షులు ఎల్లగొండ సంతు నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు దోమల శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పద్మశాలి విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ సమితి ఆధ్వర్యంలో నోటుబుక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా పదోతరగతిలో మొదటి, రెండోర్యాంకు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ సమితి ఆధ్వర్యంలో వెండి మెడల్స్‌ను కూడా అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుప్పని రవి, శిక్షణ సమితి అధ్యక్షుడు ఎల్లగొండ సంతు, కార్యదర్శి మాదాసి శ్రీనివాస్, సంఘ ఉపాధ్యక్షులు కాముని కృష్ణ, కోశాధికారి భూపతి శ్రీనివాస్, ఆడిటర్ దుర్గాప్రసాద్, సభ్యులు అల్లం మధు, చుక్క పురం గణేష్, సంఘసభ్యులు బత్తిని గంగరాజు, సిరిపురం రాజేందర్, యూత్ అధ్యక్షుడు భూపతి నాగరాజ్, దొడ్ల స్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి దశలోనే కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

వేల్పూర్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కజొన్న విత్తనం వేసిన 20 నుంచి 25 రోజుల వ్యవధిలో ఉన్న పంటకు కాండం తొలుచు పురుగు ఆవరించిందని దాని తొలిదశలోనే ఆ పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని ఎంఏవో శృతి రైతులకు సూచించారు. కాండం తొలుచు పురుగు మొక్కజొన్న ఆకు అడుగుభాగంలో గుడ్లను పెడుతుందని ఈ దశలోనే ఉన్నప్పుడు వేపనూనే 1500 పీపీఎం ఎకరానికి ఒక లీటర్ చొప్పున పిచికారి వేసుకుంటే గుడ్లు చనిపోతాయన్నారు. దీంతో తొలిదశలోనే కాండం తొలుచు పురుగును నివారణ చేసుకోగల్గుతామని ఈ విషయాన్ని రైతులు గమనించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అర్గుల రమేష్

మోర్తాడ్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ పట్టణ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అర్గుల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రజాభవనంలో ఆయనను కాంగ్రెస్ నాయకులు అభినం దిస్తు సన్మానించారు. అనంతరం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదేశాలతో మోర్తాడ్‌లో ఐదుగురు సభ్యులు గల కమిటీని ఏర్పాటు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ముత్యల రాములు, మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్ ఆధ్వర్యంలో శనివారం ఐదుగురు కమిటీసభ్యులను ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా తెడ్డు గురువయ్య, గిర్మాజి గంగాధర్, ప్రవీణ్, నజీర్, మహిపాల్, తక్కురి కిషన్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరు మోర్తాడ్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో గోపి, వై. శ్రీనివాస్, మోత్కు భూమన్న, సీహెచ్ గంగారెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు పంపుతున్న ఎస్ఐ మహేష్

ఎల్లారెడ్డి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం ఈనెల 11న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ కిరాణా షాప్ గోదాంలో షటర్ తాళాలు పగలగొట్టి లోపల ఉన్న కిరాణం వస్తువులను దొంగతనం చేసిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న పోలీసులు శని వారం ఉదయం వాహనాల తనిఖీ సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నం చేయగా అతనిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా కిరాణం షాపులో దొంగతనం చేసినట్లు నిందితుడు రాజు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

మెండోర, జూన్14 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి కోరారు. శనివారం మండలంలోని పోచంపాడ్, బుస్సాపూర్ నెహ్రూనగర్, సోన్‌పేట్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిం చారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా కొత్తింటి ముత్యంరెడ్డి మాట్లాడుతూ ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. మల్లికార్జున ఖార్గే సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మీనాక్షి నటరాజన్ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నేడు సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మండల గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరుగు తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులుసంతోష్, మోహన్, శ్రీనివాస్, లింగన్న, రమేష్, చందు, ఇమ్రాన్, సాయిరెడ్డి, బోజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట సబ్ డివిజనల్ విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు

ఎం అశోక్	ఏడీఈ, నందిపేట	- 87124 85696
విజయ్ కుమార్	ఏఏవో, నందిపేట	- 87124 85695
తోట రవి	ఏఏఈ, నందిపేట	- 87124 85660
ఆర్ రవి కిరణ్	సబ్ ఇంజనీర్	- 87124 85675
జి లింగా ప్రసాద్	సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్	- 87124 85677
ఆర్ గంగాధర్	లైన్ ఇన్స్పెక్టర్	- 87124 85668
సీహెచ్ లింబాద్రి	లైన్‌మెన్ ఐలాపూర్	- 87124 85659
కె విజయ కృష్ణ	లైన్‌మెన్ బాద్గుణ	- 87124 85663
డి కాంతయ్య	లైన్‌మెన్ వెల్మల్	- 87124 85674
కాజా మొయినోద్దిన్	లైన్‌మెన్ నందిపేట	- 87124 85669
కె రమేష్	లైన్‌మెన్ ఖుద్వాన్‌పూర్	- 87124 85665
బి మోహన్	లైన్‌మెన్ ఆంధ్రనగర్	- 87124 85661
మురళీధర్	అసిస్టెంట్ లైన్‌మెన్, కొండూర్	- 87124 85672

● (నందిపేట, ఆంధ్రజ్యోతి)

హోరాహోరీగా జిల్లా క్రికెట్ ప్రాబబుల్స్ పోటీలు


క్రికెట్ ఆడుతున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక కోసం జిల్లాలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మొదటి పోటీలలో గ్రీన్ వర్సెస్ ఎల్లో జట్టు పోటీ పడగా గ్రీన్ మొదట బ్యాటింగ్ చేసి 255 పరుగులు చేసింది. గ్రీన్ జట్టులో షహ జాన్ 53 పరుగులు చేశాడు. ఎల్లో జట్టు 100 పరుగుల తేడాతో ఓడిపోయింది. రెండవ మ్యాచ్‌లో బ్లాక్ వర్సెస్ బ్లూ పోటీ పడి బ్లాక్ జట్టు బ్యాటింగ్ చేసి 130 పరుగులు చేసింది. బ్లూ జట్టు 105 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో నవీన్ 5వికెట్లు తీసుకొని జట్టు విజ యంలో కీలక పాత్ర పోషించాడు.


రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోవడంతో అదనపు రోడ్డు ఏర్పాటు చేసిన రోడ్డుపై లారీ బోల్తా పడిన దృశ్యం (ఫైల్)


రోడ్డుపై పెద్ద వాహనాలను తీసుకువెళుతున్న దృశ్యం

'ఆంధ్రజ్యోతి' ఫోకస్


కింది రోడ్డు నుంచి వరద నీరు వెళుతున్న దృశ్యం

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యమెందుకో..?!

● రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి
● త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరిన ప్రజలు

రామారెడ్డి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తికానందున రాకపోగలరని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా కేంద్రానికి బ్రిడ్జి వారధిగా ఉన్నందున 20 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, వేంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిగా చేపట్టి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పట్టించుకోని వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని కోరారు. ఈ రహదారి గుండా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి, శ్రీ కాలభైరవ స్వామి ఆలయాలకు వేల మంది భక్తులు వస్తారని, ప్రజలను రైతులను దృష్టిలో పెట్టుకొని పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం భీంగల్, దర్పల్లి, సిరికొండ, డిచ్‌పల్లి, తదితర మండలాల ప్రజలకు ఈ బ్రిడ్జి గుండా హైదరాబాద్‌కు వెళ్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. డీఏవో సంతోషి అధికారి లేకపోవడంతో ఈఈ ఆదేశాల మేరకు ఇంకో అధికారికి వినతి అందజేశారు. గత ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించారు. మొదటి నుంచి ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో విధులు నిర్వహించి మధ్యలో కాంట్రాక్టర్ నిరసన వ్యక్తం చేస్తూనే నిరసిస్తూ ఒక్కసారిగా వదిలి వెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక దృష్టి పెట్టి బ్రిడ్జి పనులను వెంటనే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


చేలకు వెళ్లేందుకు బ్రిడ్జిపై నుంచి నిచ్చెన సహాయంతో కిందకు దిగుతున్న రైతులు (ఫైల్)

యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్న రైతులు

● తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పసుపు విత్తనాలు విత్తేందుకు పని పూర్తి
● ఎకరానికి రూ.4వేల కిరాయి

డొంకేశ్వర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ సంబంధించిన విత్తనాలు విత్తడం డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా పనులు ప్రారంభమయ్యాయి. తల్లి పంటగా పేర్కొని పసుపు విత్తనాలను రైతులు విత్తుతున్నారు. ట్రాక్టర్ యంత్రంతో పసుపు విత్తనాలు విత్తడం సలభంగా ఉందని రైతులు అంటున్నారు. సాధారణంగా పసుపు పంట ను అరకలతో బోయవేసి విత్తుతారు. కాని వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో రైతులు మొత్తం యంత్రాలను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ యంత్రం సహాయంతో పసుపు విత్తనాలు విత్తితే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తవుతుందని రైతులు అంటు న్నారు. గతంలో అరకతో రోజంతా ఎకరం భూమిలో పసుపు విత్తనాలు విత్తితే వారు ప్రస్తుతం రెండు గంట ల్లో ఎకరం పసుపు విత్తనాలను విత్తుతున్నారు. అందుకోసం ఎకరానికి 4000 కిరాయి తీసుకుంటున్నారు. ఇందులో ట్రాక్టర్ విత్తనాలు వేసే యంత్రం నలుగురు కూలీలు వస్తారు. దాంట్లో చక్రం ఉంటుంది. చక్రంలో పసుపు విత్తన కొమ్ములను ట్రాక్టర్ వెనకాల కూర్చున్న వారు పసుపు కొమ్ములను వేస్తూ ఉండాలి. ఎకరానికి 21 సంచిల విత్తనం పడుతుంది. పసుపు దిగుబడి బాగా వస్తుందని రైతులు అంటున్నారు. అరకతో కూడా అదే స్థాయిలో ఖర్చు అవుతున్నప్పటికీ సమయం ఆదా అవుతుందని ట్రాక్టర్ యంత్రంతో ఒక్కరోజు ట్రాక్టర్ యంత్రం 5 నుంచి 6 ఎకరాల విస్తీర్ణంతో విత్తనాలు విత్త వచ్చునని రైతులు అంటున్నారు.


ట్రాక్టర్ సాయంతో పసుపు విత్తనం వేస్తున్న రైతులు

కొన్ని చోట్ల ఎద్దులతో విత్తనాలు వేస్తారు..

పసుపు పంట విత్తడం కోసం ఇతర ప్రాంతాల నుంచి ఎద్దులను అద్దెకు తీసుకువచ్చి విత్తనాలను వేస్తారు. ప్రస్తుత కాలంలో రైతులు అరకలతో అంతగా విత్తనాలను విత్తడం లేదు. తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలు విత్తే అవకాశం ఉండటంతో రైతులు ట్రాక్టర్ వైపే ముగ్గు చూపుతున్నారు. అకకతో ఎకరం భూమిలో పసుపు వేసేందుకు ఒక రోజు పడుతుంది. ట్రాక్టర్ యంత్రంతో పసుపు వేయడం రెండు గంటల్లో పూర్తవుతుంది.

తక్కువ సమయంలో ఎక్కువ పని అవుతుంది ..

బార్ల వంశీరెడ్డి, రైతు, డొంకేశ్వర్



ట్రాక్టర్ యంత్రంతో పసుపు విత్తనం వేయడం ద్వారా తక్కువ టైంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తవుతుంది. ఎకరం పసుపును రెండు గంటల్లో విత్తకోవచ్చు. శ్రమ కూడా తక్కువగానే ఉంటుంది. ఎకరానికి 4వేల రూపాయలు ఖర్చు అవుతుంది.

కోప్తా చట్టాన్ని రద్దు చేసి కార్మికుల చట్టాలను అమలు చేయాలి

● టీయూసీఐ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నాయకుడు అర్వింద్


లక్కోరలో టీయూసీఐ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేల్పూర్, జూన్14 (ఆంధ్రజ్యోతి): కోప్తా చట్టాన్ని రద్దు చేసి బీడీ, వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల చట్టాలను అమలు చేయాలని టీయుసీఐ జిల్లా నాయకులు అర్వింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈనెల 21, 22 వ తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో జరుగనున్న టీయుసీఐ రాష్ట్ర ప్రథమ మహా సభలను వియజవంతం చేయాలని పిలుపునిచ్చి వేల్పూర్ మడల లక్కోర గ్రామంలో పీకేపీపీ బీడీ సెంటర్ ముందు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాటం సాధించుకున్న 44 చట్టాలలో 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేసిందన్నారు. ఉన్న 29 చట్టాలను 4 లేబర్‌కోర్టుగా విభజించి ఆదాని అంబానిల ఫ్యాక్టరీలకు వివిధ కంపెనీల యజమానులకు అనుకూలంగా చేస్తు కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలను చేయడం సరైంది కాదన్నారు. ఎనిమిది గంటల పనిదినం పోరాటం చేసి సాధించుకుంటే ఈ రోజు నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం పదిగంటల నుంచి 12 గంటలకు పని పెంచడం సరైంది కాదన్నారు. బీడీ కార్మికులకు నెలకు 25 రోజులు పని కల్పించాలని రోజుకు వెయ్యి బీడీలు పని ఇవ్వాలని బీడీలకు సరిపడినంత తునికాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జరుగనున్న మహసభకు కార్మికులు, కర్షకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ ప్యాకర్స్, కార్మికులు గంగాధర్, లింబాద్రి, అనువర్, పద్మ, హేమలత, సాయన్న, రాజేందర్, ఆనంద్, కావేరి, జ్యోతి, మానిష, మురళి, రమేష్, స్రవంతి, జగదీష్, హన్మాండ్లు, బుచ్చిర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

భారీ వర్షాలు కురిసినా ప్రాజెక్టులోకి రాని నీరు

● ఏడూరి ప్రాజెక్టు నిండితేనే కౌలాస్‌లోకి నీటి చేరిక


కొద్దిపాటి నీళ్లతో దర్శనమిస్తున్న కౌలాస్ నాలా ప్రాజెక్టు


వర్షాలు కురిసిన నిండని కౌలాస్ నాలా ప్రాజెక్టు

జుక్కల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల 20 రోజుల పాటు భారీ వర్షాలు కురి సినప్పటికీ కౌలాస్ నాలా ప్రాజెక్టులో వర్షపు నీరు చేరలేదు. కౌలాస్ నాలా ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1,237 టీఎంసీ ఉండగా ప్రస్తుతం నీటి నిల్వ 0.580 టీఎంసీ నీరు ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు కురిస్తే ఏడూరి ప్రాజెక్టు నుంచి అక్కడి ప్రాజెక్టు అధికారులు ఏడూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే కౌలాస్ నాలా ప్రాజెక్టుకు నీరు చేరుతుందని చేరుతుందని ప్రాజెక్టు ఏఈ రవి తెలిపారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటి నిలువలు ఉంటే ప్రాజెక్టు ఆయకట్టు భాగం 10 గ్రామాల రైతులు పుష్కలంగా పంటలు పండిస్తారు. అకాల వర్షాలు కర్ణాటక రాష్ట్రంలో లేకపోవడంతో కౌలాస్‌నాలా ప్రాజెక్టుకు నీరు రావడం లేదని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు కురిసినా కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి చుక్క నీరు చేరదు.. ఎందుకంటే తెలంగాణ, కర్ణాటక సరి హద్దులో కౌలాస్ నాలా ప్రాజెక్టు వాగుపై నిర్మించారు. ప్రాజెక్టు నిండాలంటే కర్ణాటకలో భారీ వర్షాలు కురవాలని రైతులు పేర్కొంటున్నారు. జుక్కల్, బిచ్కుంద మండలం రైతులకు వరి నాట్లు వేసేం దుకు కౌలాస్ నాలా ప్రాజెక్టు నీరు అవసరం. ప్రాజెక్టు నిండితేనే అధికారులు పంట కాలువలకు నీరు వదిలిపెట్టే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

బట్టాపూర్‌లో బురదమయంగా రోడ్డు

● పట్టించుకోని అధికారులు
● రోగాల బారిన పడుతున్న స్థానికులు

ఏర్గట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ రోడ్డు వర్షపు నీరుతో నిండి చెరువును తలపిస్తోంది. చిన్న పాటి వర్షానికే రోడ్డుపై మొత్తం నీరు నిలవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికే నిరు మొత్తం చేరి బురదమయంగా మారి దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. పది రోజు లుగా రోడ్డుపై నీరు అలాగే ఉన్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నిరుపయోగంగా స్లాటర్ హౌస్

● సంవత్సరాలుగా వృథాగా మారిన స్లాటర్ హౌస్, మాంసం దుకాణాల గదులు
● వినియోగంలోకి తేవాలని కోరుతున్న గ్రామస్థులు ● పట్టించుకోని పంచాయతీ అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోపాల్ పేట్‌లో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్లాటర్ హౌస్ సంవత్సరాలుగా నిరూపయోగంగా ఉంది. స్లాటర్ హౌస్, మేక మాంసం విక్రయ దుకాణాల కోసం నూతనంగా నిర్మించిన గదుల నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా వీటిని సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకురావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్లాటర్ హౌస్, దుకాణాల గదుల నిర్మాణం కోసం సుమారు ఆరు లక్షల రూపాయలు వరకు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తేక వృథాగా వదిలేయడం పట్ల స్థానికులు అధికారుల తీరు పట్ల మండిపడుతున్నారు. మండల కేంద్రంలో మేక మాంసం విక్రయ దుకాణదారులు తమ ఇళ్ల వద్ద మేకలను, గొర్రెలను కోస్తూ తమ ఇళ్ల వద్దనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని మాంసాన్ని విక్రయిస్తున్నారు. దీంతో కటికే బజారులోని మురికి కాలువ ద్వారా మురికి నీరంతా మురికి కాలువల్లో నిలిచి పోయి ఆ ప్రాంతం దుర్గంధ మయమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురికి కాలువలో మురికి నీరు నిల్వ ఉండడంతో దోమలు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రజల అవస్థలను తొల గించడానికి మండల కేంద్రంలో స్లాటర్ హౌస్‌ను నిర్మించాలని మేక మాంసం దుకాణాలను కటికె బజార్ నుంచి మార్చాలని గతంలోనే గ్రామ పంచాయతీ అధికారులు నిర్ణయించారు. దీంతో గత ఆరు సంవత్సరాల క్రితం అప్పటి నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి, స్లాటర్ హౌస్ ఏర్పాటు కోసం సుమారు ఒక లక్ష 90 వేల రూపాయలు వెచ్చించి స్లాటర్ హౌస్ ఏర్పా టు కోసం రెండు గదులను నిర్మించారు. అయితే స్లాటర్ హౌస్‌కు కావలసిన అన్ని సౌకర్యాలు లేకపోవడంతో, గదులు సరిపోకపోవడంతో స్లాటర్ హౌస్ ఏర్పాటు విషయం ముందుకు సాగలేదు. దీంతో నాగి రెడ్డిపేట గ్రామపంచాయతీ నుంచి విడిపోయి గోపాల్ పేట్ ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు కావడంతో గోపాల్ పేట్ గ్రామ సర్పంచ్‌గా ఎంపి కైన వంజరి సునీత అర్ధాంతరంగా నిలిచిపోయిన స్లాటర్ హౌస్ నిర్మాణం పనులను, అదనంగా గదులను నిర్మింపజేయాలని ఆమే స్లాటర్ హౌస్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకు న్నారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా సుమారు నాలుగు లక్షల 20 వేల రూపాయలు వెచ్చించి మేకలు, గొర్రెలు కోయ టానికి స్లాటర్ హౌస్ షెడ్‌ను, అదనంగా మరో మూడు నూతన గదుల ను నిర్మింపజేసి నీటి వసతితో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి సిద్ధం చేశారు. స్లాటర్ హౌస్ కోసం కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేశారు. మేక మాంసం విక్రయ దారులు తమ మాంసం దుకా ణాలను కటికే బజార్ నుంచి తొలగించి స్లాటర్ హౌస్‌లోకి మార్చాలని గ్రామ పంచా యతీ అధికారులు మాంసం విక్రయ దుకాణదారులకు ఎన్ని సార్లు ఆదే శించినా ప్రయోజనం కలుగలేదు. మేక మాంసం దుకాణదారులు తమ మాంసం దుకాణాలను స్లాటర్ హౌస్‌లోకి మార్చేందుకు వారు ఏ మాత్రం ముందుకు రావడం లేదు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు మేక మాంసం దుకాణాలను స్లాటర్ హౌస్ గదుల్లోకి మార్చాలని దుకాణ దారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం కలగలేదు. మాంసం విక్రయదారులు ఏమాత్రం సందించ లేదని తమ దుకాణాలను కటికే బజార్ నుంచి తొలగించడం లేదని స్థానికుల అనిపిస్తున్నారు. స్లాటర్ హౌస్ ఏర్పాటు కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా మేక మాంసం దుకాణాలను స్లాటర్ హౌస్‌లోకి మార్చడంలో గ్రామ పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకొని మాంసం దుకాణాలను కటిక బజారు నుంచి స్లాటర్ హౌస్ లోకి మార్చాలని, సంవత్సరాలుగా వృథాగా ఉన్న స్లాటర్ హౌస్‌ను వినియోగం లోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వృథా గా ఉన్న స్లాటర్ హౌస్ విషయమై గోపాల్ పేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్టయ్యను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తగు చర్యలు తీసుకోని స్లాటర్ హౌస్‌ను విని యోగంలోకి తెస్తామన్నారు.


వృథాగా ఉన్న మేక మాంసం దుకాణాల కోసం నిర్మించిన గదులు


మేకలు కోసేందుకు ఏర్పాటు చేసిన స్లాటర్ హౌస్ షెడ్

నూతన కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ చైర్మన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన టి.వినయ్‌కృష్ణారెడ్డిని గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హన్మంతు కలెక్టర్‌గా ఉన్నప్పుడు గ్రంథాలయ పాఠకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినందుకు నిధులు మంజూరీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ బి.తారకం, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యానంద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీని ప్రకటించి పెండింగ్‌లో ఉన్న డీఏ, బిల్లులను చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్ డిమాండ్ చేశారు. నగరంలోని మల్లుస్వరాజ్యం ట్రస్ట్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ శాలలో ఉపాధ్యాయుల సర్దుబాటును పూర్తిగా నిలిపివేయాలని, ప్రాథమి క పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను, తరగతి గదికి ఒక ఉపాధ్యాయు డిని నియమించాలన్నారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరు ద్ధరించాలని, 317 జీవో బాధితులకు స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, మల్లేష్, రాజారాం, జనార్ధన్, సాయన్న, బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

సుభాష్‌నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా నెట్‌బాల్ అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్‌రావు, రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికలు నిర్వహించారు.ఈఎన్నికలకు పరిశీలకులుగా కామారెడ్డి జన రల్ సెక్రెటరీ రఘురాం, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న,ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య హాజరయ్యా రు.ఈఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. కోశాధికారిగా పి.గంగాధర్, చైర్మన్‌గా రవీందర్, వైస్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ఎం.నాగేష్, రమేష్, జాయింట్ సెక్రెటరీగా నాగరాజు, కృష్ణంరాజు, ఆశాజ్యోతి, అనిల్‌కుమార్, ఈసీమెంబర్‌లు కుమార్, ప్రవీణ్, రాజు, సాగర్, అప్పారావు, మధుకర్, ప్రసన్నలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లా లో నెట్‌బాల్ ఆట అభి వృద్ధికి కృషి చేస్తానని క్రీడాకారులను నెట్‌బాల్ ఆడేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

40మంది దాడిచేస్తే ఆరుగురిపై కేసులా ?

మోర్తాడ్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల కేంద్రంలో ఇటీవల సురేష్ పై 40 మంది ఓ వర్గానికి చెందిన వారు ప్లాన్ ప్రకారం దాడి చేసి తీవ్రంగా ఇనుపరాడు కర్రలతో చితుకబాది బుల్లెట్ బైక్‌ను కాళ్లపై నడిపించి కాళ్లు విరగ గొట్టారని మరో సంఘం సభ్యులు ఆరోపించారు. ఓ వర్గం యువకుడిపై మరో వర్గం వారు తీవ్రంగా కొట్టడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వారు వివరించారు. బాధితుని భార్య సౌమ్య ఫిర్యాదు చేసిన పోలీస్ యంత్రంగా కేవలం ఆరుగురిపై కేసు వేశారని మిగత 34 మందిని తప్పించారని ఆరోపించారు. సమావేశంలో శివానంద్, పుప్పాల నరేష్, శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, జైడి గంగారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, చిన్నారెడ్డి, అనిల్, సాగర్, మురళి, నర్సయ్య, మోహన్, గంగారెడ్డి, నాగారెడ్డి, నవీన్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

రూ.40లక్షల 50వేలతో పరారైన ఉద్యోగి

నిజామాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):రోజువారిగా ఏటీఎంలలో నగదు జమ చేసే ఓ ఉద్యోగి రూ.40లక్షల 50వేలతో పరారైన ఘటన శనివారం నగరంలో జరిగింది. న్యాల్‌కల్ రోడ్డులో నివాసం ఉండే రమాకాంత్ నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ఈటాచీ అనే ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రోజూ ఏటీఎంలలో నగదు జమ చేయడానికి వెళ్లే రమాకాంత్ శనివారం కూడా ఎల్లమ్మగుట్టలోని ఆఫీస్ నుంచి నగదును వాహనంలో పెట్టకుండా రూ.40 లక్షల 50వేల నగదు ఎత్తుకొని పరారైనట్లు ఏజెన్సీ మేనేజర్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 4వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా ఆయా బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో డబ్బులు జమ చేసే ప్రక్రియలో భాగంగా రమాకాంత్ డబ్బుతో ఉడాయించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మిగిలిపోయిన భాష పండితుల పోస్టులు అప్‌గ్రేట్ చేసి పదోన్నతి కల్పించాలి

డిచ్‌పల్లి,జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): మిగిలిపోయిన 670 భాష పండిత పోస్టులను వివిధ జిల్లాల్లో అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమిలుల్ల, అన్నారు. శనివారం ఆయన డిచ్‌పల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ.. 2005 యాక్ట్ రద్దు చేయాలని 330 జీవో పునరుద్దరన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు అనేక అంశాలను వీటిని పూర్తిగా చేయాలని రాష్ట్ర సమావేశంలో కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమనచారి, ప్రసాద్, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇందల్వాయి,జూన్ 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని లోలంవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. లోలం వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పక్కా సమాచారం మేరకు వాగు వద్దకు వెళ్లి చూడగా నాలుగు ట్రాక్టర్లు ఇసుకను నింపుతుండగా ఆ ట్రాక్టర్లకు పర్మిషన్ లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై సందీప్ హెచ్చరించారు.

రైతు నేస్తం కార్యక్రమానికి రైతు వేదికలను ముస్తాబు చేయాలి

● కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



రైతుల వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

డిచ్‌పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని రైతు వేదికలను అందంగా ముస్తాబు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిచ్‌పల్లి మండలం నడిపల్లి, మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ప్రతీ రైతు వేధికలో నీటి వసతి, టాయిలెట్స్, సరిపడా ఫర్నీచర్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతువేధికలు పరిశుభ్రంగా ఉండాలని ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వేధిక ఆవరణాలలో అందమైన పూల మొక్కలు, పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటాలని అన్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి ఆదర్శ రైతులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి జరుపనున్నందున ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ప్రాథమిక ఉపకేంద్రం

● వర్షం పడితే ప్రాథమిక ఉపకేంద్రంలో నీళ్లు ● అరచేతిలో ప్రాణాలతో ఉద్యోగం ● పట్టించుకోని సంబంధిత అధికారులు



శిథిలావస్థలో ప్రాథమిక ఉపకేంద్రం



వర్షపు నీటి తేమతో నిండిన ప్రాథమిక ఉపకేంద్రం

మోపాల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాలు మారుతున్నాయి. రాజకీయ నాయకులు మారుతున్నా శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఉపకేంద్రం భవనం మారడం లేదని పలువురు వాపోతున్నారు. మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఉపకేంద్రాన్ని ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించారు. ఈ భవనంలో ప్రాథమిక ఉపకేంద్రాన్ని గత కొన్ని సంవత్సరాల నుంచి నడుస్తుంది. వర్షం పడితే పైకప్పు మీదనుండి వర్షపు నీరు పడుతుంది. ఈ భవనం ఎప్పుడు కూలి మీదపడుతుందోనని భయంగా ఉందని ఇందులో పనిచేసే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనం పరిస్థితి ఎన్నో సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి ఎటువంటి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇన్ని సేవలు చేస్తున్నా భవనం గురించి పట్టించుకునే వారే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఈ భవనంలో విధులు నిర్వహిస్తున్నామని భయంగా ఉందని ఆశ, ఏఎన్ఎం వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలల్లో చేరొద్దు :డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో, నగరంలోని గుర్తింపు లేని ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలల్లో విద్యార్థులు చేరవద్దని డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు అఫిలియేషన్ గుర్తింపు ఉందా లేదా అని స్పష్టంగా తెలుసుకొని మాత్రమే విద్యార్థులు కళాశాలల్లో చేరాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు మోసపోకుండా కళాశాలకు గుర్తింపు ఉందా లేదా అని తెలుసుకొని అడ్మిషన్ పొందాలని తెలిపారు. అఫిలియేషన్ లేని జూనియర్ కళాశాలల్లో చేరితే ఇంటర్మీడియెట్ బోర్డుకు ఎలాంటి సంబంధం ఉండదని కావున ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

కంజర్‌లో డ్రగ్స్‌పై అవగాహన

మోపాల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామంలో శనివారం డ్రగ్స్‌పై పోలీసులు యువతకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదని ఎస్సై యాదగిరి గౌడ్ గ్రామస్తులకు వివరించారు. మత్తు పదార్థాలు సేవించడం వల్లజరిగే నష్టాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు.ఇటువంటి వారికి దూరంగా ఉండాలని కోరా రు. యువత కోసం ప్రభుత్వం అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుం దని అన్నా రు. యువతచెడు మార్గంలో వెళ్లకుండా మంచి మార్గంలో నడుచుకోవాలని కోరారు.

మంచిప్పలో ఒకరి ఆత్మహత్య

మోపాల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిప్ప గ్రామానికి చెందిన లంబాని గోవర్ధన్ (35) శనివారం మనస్థాపంతో చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు పోలీసులకు వివరించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సందర్శించి శవాన్ని చెరువులోంచి తీసి శవపంచనామా కుటుంబ సభ్యుల సమక్షంలో జరిపారు. ఆత్మహత్యకు గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై యాదగిరి గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

డిచ్‌పల్లి,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లో నిరుద్యోగులకు, యువతకు సెల్‌ఫోన్ శిక్షణ, ఏసీ రిపేర్ శిక్షణలకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ రవికుమార్ శనివారం తెలిపారు. సెల్ ఫోన్ 30రోజులు, ఏసీ రిపేర్ శిక్షణ 30రోజులు ఉంటుందని ఉచిత శిక్షణతో పాటు హాస్టల్ వసతి, నేర్చుకోవడానికి కావల్సిన టూల్స్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన యువతకు ఈ అవకాశం ఉందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఆసక్తిగల వారు డిచ్‌పల్లి లో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి కార్యాయంలో పేరు నమోదు చేసుకోవాలని 19-40 ఏళ్లలోపు వారికి ఈ అవకాశం ఉందని ఆయన తెలిపారు. నమోదు చేసుకోవాలనే వారు ఆధార్, రేషన్, పదో తరగతి మెమో జిరాక్స్ లు, పాస్‌పోర్టు సైజ్ పోటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 08461 295428 కు సంప్రదించలన్నారు.

పలువురిని పరామర్శించిన రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోగల పలువురిని శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించారు. గంగాస్థాన్ ఫేస్-2లో ఉండే రంజిత్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలూర్ గ్రామంలోని పట్వారి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట నాయకులు మారచంద్రమోహన్, బాగారెడ్డి, నరేష్, గంగాధర్, భోజన్న, తదితరులు ఉన్నారు.

నర్సయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మిద్దాం

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జేపీ గంగాధర్

డిచ్‌పల్లి,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతాంగ పోరాట యోధుడు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అమరుడు కామ్రెడ్ నాయక్‌వాడి నర్సయ్య పోరాట స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలను నిర్మిద్దామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి .జేపీ గంగాధర్ అన్నారు. మెంట్రాజ్‌పల్లిలో శనివారం సీపీఐఎంఎల్ డిచ్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నర్సయ్య చిత్రపటానిరి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్, పీవోడబ్ల్యూ నాయకురాలు సుప్రియ, నాయకులు, లక్ష్మీ, శాంత, రాజమని, పాండు, వై.లక్ష్మీ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించుకోవాలి

డిచ్‌పల్లి,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదకు అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులు సకాలంలో నిర్మించుకోవాలని డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని దూస్‌గాం గ్రామంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరైన ప్రతి ఒక్కరికి ప్ర భుత్వం విడుతల వారిగా రూ.5లక్షలు మంజూరు చేస్తుందని కావున ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దుర్గేశ్, సంతోశ్, పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి ఐఎస్‌వో పత్రాన్ని అందజేసిన గవర్నర్



గవర్నర్ నుంచి ఐఎస్‌వో పత్రాన్ని అందుకుంటున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులకు గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవలకు గాను, రక్తదాన శిబిరాలు, తలసేమియా అవగాహన సదస్సులను ప్రామాణికంగా తీసుకొని వరుసగా మూడోసారి ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అత్యధికంగా 67 సార్లు రక్తదానం చేసిన జిల్లాకు చెందిన గంగాధర్‌కు గవర్నర్ అవార్డును అందజేశారు. సర్టిఫికెట్‌ను అందుకున్న వారిలో జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్, కరిపె రవీందర్, అవార్డు గ్రహిత గంగాధర్‌లు ఉన్నారు.

సిరికొండ: ప్రపంచ రక్తాదాతల దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అంద జేశారు. సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో హరీష్‌గౌడ్, బాలరాజ్, రాజు,కిసన్,రవి, మహేష్, శేఖర్,రాజేశ్వర్,గోపాల్ తదితర తూంపల్లి యువకులను హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షులు అయినాల శ్రీకాంత్ ప్రశంసిస్తూ ప్రసంగిం చారు.ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్‌ల క్ష్మన్‌గౌడ్,ఫౌండేషన్ ఉపాద్యాక్షులు రాజేందర్,రవి,ప్రశాంత్,యశ్వంత్, బాలరాజ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

ధర్పల్లి,జూన్ 14 (ఆంధ్రజ్యోతి):మండలంలో వనమహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. పైనుంచి ఆదేశాలు వచ్చిందే తడువుగా మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక నర్సరీని ఏర్పాటు చేశారు.ఇప్పటికే నర్సరీలో మొక్కలు వనమహోత్సవానికి తరలించేందుకు సిద్ధం చేశారు. ఒక్కో గ్రామంలో 9వేల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. నర్సరీలో పూల మొక్కలతో పాటు పండ్లు, నీడను ఇచ్చే మొక్కలు పెంచుతున్నారు. ప్రతీ మొక్కను రక్షించుకునేలా అందరి సహకారం అవసరమని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణ బాధ్యత సైతం తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బందితో పాటు గ్రామంలోని యువజన సంఘాలు, యువకులు వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి తమవంతు బాధ్యత నిర్వహించాలని పేర్కొన్నారు.

జోరుగా ఇసుక తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

రవాణా అవుతోంది. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు కూడా ఇసుకను తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగానే ఇసుకను ఇస్తున్నా ఇతర అభివృద్ధి పనులకు మాత్రం వేబిల్లు ప్రకారం అనుమతులు ఇస్తున్నారు. ఈ నది వెంట కాకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని వాగులను కూడా వదిలిపెట్టడం లేదు. పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్, కుడెల్లి, పాల్వంచ వాగుతో పాటు ఇతర వాగుల్లో భారీగా ఇసుక తవ్వకాలను చేస్తున్నారు. కొన్ని చోట్ల అనుమతులున్నా మరికొన్ని చోట్ల అనుమతులు లేకుండానేతవ్వకాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగే ఇసుక తవ్వకాలపై గతంలోనే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, నిఘా వర్గాల అధికారులు పలు నివేదికలు ప్రభుత్వానికి పంపించారు. అయినా ఫలితం మాత్రం లేదు. ఇసుక తవ్వకాలపై స్పందించేందుకు మాత్రం అధికారులు ముందుకు రావడం లేదు. అధికారులు దృష్టిపెడితే అక్రమ ఇసుక రవాణా ఉమ్మడి జిల్లాలో ఆగే అవకాశం ఉంది.

జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ఒరవడిలోనే ముందుకు సాగుతూ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానన్నారు. తాను ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెదులుతానని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేద్దామన్నారు. సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్‌డీవో రాజేంద్రకుమార్, రాజాగౌడ్‌లు బదిలీపై వెళ్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతుతో పనిచేసిన అనుభవాలను నెమరువేసుకున్నారు.ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ హన్మంతును జ్ఞాపిక, గజమాలతో సన్మానించారు. ఈ సమావేశంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు రమణ్‌రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కిషన్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నగరంలో రెండు పార్టీలే గెలుస్తాయని తెలిపారు. మెజార్టీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని కొన్ని ప్రాంతాల్లో ఎంఐఎం గెలిచే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్‌కు పోటీ చేయడానికి అభ్యర్థులే లేరని అన్నారు. కొందరు బీజేపీ నాయకులు బీజేపీలో టిక్కెట్ రాకపోతే కాంగ్రెస్‌లోకి వెళ్లాలని ఆలోచనలో ఉన్నారని అన్నారు. అలాంటి వారు కాంగ్రెస్‌లోకి వెళితే ఆత్మహత్య చేసుకున్నట్లేనని తెలిపారు. బీజేపీలో పోటీ ఎక్కువగా ఉందని ఈ మేరకే బీజేపీ నాయకులపై సర్వే చేసినట్లు తెలిపారు. రానున్న భవిష్యత్తు బీజేపీదేనన్నారు. ఈ సమావేశంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, బీజేపీ సీనియర్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల కోసమే ఇన్‌చార్జి మంత్రి మార్పు!

(మొదటి పేజీ తరువాయి)

పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ఉన్నారు. క్యాబినెట్‌లో చోటు లేకపోవడం వల్ల ఉమ్మడి శ్రేణుల్లో నిరాశ పెరుగుతుంది. ఉమ్మడి జిల్లాకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, సమస్యలు క్యాబినెట్ దృష్టికి రావడం లేదని ఎక్కువ మంది నేతలు భావిస్తున్నారు. గతంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాకు నిధులు కూడా తక్కువగా వస్తుండటంతో పనులు చేసే పరిస్థితి ఉండడం లేదు. ఉమ్మడి జిల్లాకు మంత్రి లేకపోవడం వల్ల కాంగ్రెస్ శ్రేణులు అవసరమైతే తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోయే పరిస్థితులు లేవు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఉన్నా జిల్లాకు రాకపోవడం కలిసే అవకాశం లేకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. మంత్రి లేకపోవడం వల్ల వచ్చే ఎన్నికల్లో సమన్వయం చేసే వారు లేరు. ఎమ్మెల్యేలు ఉన్నా తమ నియోజకవర్గాలకు పరిమితం కావడంతో ఇబ్బందికర పరిస్థితులు పార్టీకి ఏర్పడుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గట్టి పోటీ ఉండటం వల్ల ఎక్కువ సమయం ఇచ్చే సీతక్కకు ఇంచార్జిగా అవకాశం ఇచ్చినట్లు పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కువ గ్రూపులు ఉన్న సమన్వయం చేయడం మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. సీనియర్ నేతలను కలుపుకొని క్యాడర్‌లో జోష్ నింపితే తప్ప వచ్చే ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునే పరిస్థితి లేదు. ఎన్నికల సమయంలో ఇంచార్జి మంత్రిని మార్చడం వల్ల తమకు కలిసి వస్తుందని కొంత మంది పార్టీ నేతలు చెబుతున్నా మరికొంత మంది నేతలు మాత్రం సమన్వయం చేయడంతో పాటు పార్టీ కోసం పని చేసిన వారికి టిక్కెట్ ఇచ్చి గెలిపిస్తేనే ఉపయోగం ఉంటుందని వారు వివరిస్తున్నారు. కొత్తగా నియమితులైన ఇంచార్జి మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లాకు వచ్చి ఎమ్మెల్యేలు, నేతలతో సమన్వ యంతో కార్యక్రమాల్లో పాల్గొంటే కొంత మారే అవకాశం ఉంది.

డిచ్‌పల్లి సీఐను సన్మానించిన పద్మశాలీ సంఘం సభ్యులు

డిచ్‌పల్లి,జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): డిచ్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్‌రెడ్డిని శనివారం డిచ్‌పల్లి మండల పద్మశాలీ సంఘం ప్రతినిధులు మార్యదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. సీఐను సన్మానించిన వారిలో పద్మశాలీ సంఘం ప్రతినిధులు డా.ఆశోక్, హరికిషన్, మురళి, వెంకట్, ఉన్నారు.